అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు

ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులు ?



సరూర్‌నగర్ పోస్టాఫీస్ చౌరస్తాలో దేవాలయం పక్కనే ఏర్పాటు చేసిన దుకాణం

ఎల్బీనగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా టపాసులు విక్రయించేందుకు బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కొని విధివిధానాలను ఏర్పాటు చేసింది. బాణాసంచా దుకాణం ఏర్పాటు చేసే స్థల యజమాని కమ్యూనిటీహాల్స్, ప్రభుత్వ ఖాళీ స్థలాలకు సంబంధించిన వారి నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాల్సి ఉంటుంది. అందుకుగాను అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖకు నిర్ణీత రుసుం చెల్లించి వారి నుంచి ఎన్‌ఓసీ తీసుకుని జీహెచ్‌ఎంసీలో దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలి. 10/10 అడుగుల విస్తీర్ణంలో బాణసంచా దుకాణాన్ని ఏర్పాటు చేస్తే రూ.11వేలను, అంత కంటే ఎక్కువ విస్తీర్ణంలో పెద్దఎత్తున ఏర్పాటుచేస్తే రూ.66వేలను జీహెచ్‌ఎంసీకి చెల్లించి ట్రేడ్‌లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఖాళీస్థలాలు, నివాసిత ప్రాంతాలకు దూరంగా, అనుమతి పొందిన ప్రదేశంలో మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ చాలా మంది టపాసుల విక్రేతలు ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా ఇష్టారాజ్యంగా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. సరూర్‌నగర్ ప్రధాన రహదారిపై, కొత్తపేట సమీపంలో ప్రధానరహదారిపై, సరూర్‌నగర్ పోస్టాఫీస్ చౌరస్తా వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. అదేవిధంగా సరూర్‌నగర్ చెరువు కట్టపై ప్రతిరోజూ సాయంత్రం కాగానే సందర్శకులు పెద్దఎత్తున వచ్చి సేదతీరుతుంటారు. అలాంటి ప్రదేశాల్లో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయకూడదు. కానీ అధికారులు అవేవీ చూడకుండానే జీహెచ్‌ఎంసీకి డబ్బులు కడితే చాలు అన్నట్లు ట్రేడ్‌లైసెన్స్‌లు ఇచ్చేస్తున్నారు. సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులను ఎవరైనా అడిగితే 'అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ ఎన్‌ఓసీ ఇచ్చాయి కదా. మేము ట్రేడ్ లైసెన్స్ ఇస్తున్నాం. అయినా మేము తనిఖీలు చేస్తూనే ఉంటాం' అని బదులిస్తున్నారు. అగ్నిమాపకశాఖ ఎల్బీనగర్, హయత్‌నగర్ సర్కిళ్ల పరిధుల్లో ఇప్పటి వరకు బాణాసంచా దుకాణాల ఏర్పాటు కోసం 349 దరఖాస్తులు రాగా 260 దరఖాస్తుదారులకు ఎన్‌ఓసీలు ఇచ్చామని ఎల్బీనగర్ ఫైర్‌ఆఫీసర్ శ్రీధర్ తెలిపారు. వారంతా నిబంధనలకు అనుగుణంగానే దుకాణాలు ఏర్పాటు చేయాలని లేకుంటే వాటిని రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

మార్కెట్లలో దీపావళి సందడి

- 20 శాతం వరకు పెరిగిన టపాసుల ధరలు
- బాణసంచా కాల్చేటప్పుడు.. జాగ్రత్త సుమా

సైదాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వెలుగుల పండుగ దీపావళి సందడి మొదలైంది. మార్కెట్లలో బాణాసంచా, స్వీట్లు, డ్రైఫూట్స్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సైదాబాద్, మాదన్నపేట, చంపాపేట, సంతోష్‌నగర్, మలక్‌పేటలో టపాసుల దుకాణాలు పెద్దసంఖ్యలో వెలిశాయి. పెరిగిన ధరలతో బాణాసంచా కొనాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 15 నుంచి 20 శాతం వరకు ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో కేజీ సేల్‌తో వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. రకాలను బట్టి కేజీ రూ.500 నుంచి 1200 వరకు అమ్ముతున్నారు. ఫ్యామిలీ ప్యాక్స్ అంటూ ఒక్కో ప్యాక్ రూ.2,500 నుంచి రూ.6 వేల వరకు అమ్ముతున్నారు. అంతేగాకుండా దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మీపూజలు, నోములు, వ్రతాలు ఆచరించేందుకు ఇళ్లు, వ్యాపార సముదాయాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ యేడాది టపాసుల ధరలు పెరిగాయి. కాకర పువ్వొత్తుల బాక్స్ ధర (మంచి కంపెనీ అయితే) రూ.90 నుంచి రూ.110 ఉంది. చిచ్చుబుడ్డులు పెద్దవి రూ.300 వరకు, భూచక్రాలు రూ.100 నుం 120 దాకా ఉన్నాయి.



సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా స్టాళ్లు

హరిత టపాసులపై కరువైన అవగాహన

హరిత టపాసులపై అవగాహన కల్పించడం లేదు. టపాసుల వల్ల వాతావరణం దెబ్బతింటుందని పర్యావరణ ప్రేమికులు పదేపదే చెబుతున్నా ఎకో దీపావళిపై ఎలాంటి ప్రచారం జరగడం లేదు. గ్రీన్‌దీపావళి జరపాలని కొందరు సూచిస్తున్నా ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదని విమర్శలు ఉన్నాయి.

అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన నంబర్లు

అగ్నిమాపక శాఖ కంట్రోల్ రూం	101
మలక్‌పేట ఫైర్‌స్టేషన్	87126 99414
హయత్‌నగర్ ఫైర్‌స్టేషన్	040-24203108
అగ్నిమాపక అధికారులు	
మలక్‌పేట	87126 99415
ఎల్బీనగర్	87126 85791
హయత్‌నగర్	87126 99407

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు

- నాణ్యమైన గుర్తింపు కంపెనీలకు చెందినవి మాత్రమే కొనుగోలు చేయాలి.
- కాటన్ దుస్తులు ధరించి బాణసంచా కాల్చాలి
- మైదానాలు, ఖాళీ స్థలాల్లో మాత్రమే కాల్చాలి.
- చిచ్చుబుడ్లు, రాకెట్లు వెలిగించే సమయంలో తలకు దూరంగా పెట్టి వెలిగించాలి
- పటాకులు కాల్చే సమయంలో కళ్లకు ప్రొటెక్టెడ్ గ్లాసులను ధరిస్తే మంచింది.
- శంఖు, భూచక్రాలను ఇళ్లలో కాల్చవద్దు. కొన్ని సందర్భాల్లో పేలే ప్రమాదం ఉంటుంది.

అనుమతులు తప్పనిసరి



ప్రభుత్వ అనుమతులు లేకుండా టపాసులను నిల్వ ఉంచినా, విక్రయించినా పేలుడు పదార్థాల చట్టం కింద చర్యలు తప్పవు. జనావాసాల మధ్య బాణాసంచా విక్రయించడం, స్టాక్ పెట్టడం కూడా నేరం. స్టాళ్ల వద్ద ఇసుక, అగ్నిమాపక సామగ్రి సిద్ధంగా ఉంచాలి. బాణసంచా పేల్చేటప్పుడూ ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని, పండుగను ఆనందమయం చేసుకోవాలి.

- కె.రాఘవేందర్, ఇన్‌స్పెక్టర్, సైదాబాద్

నిర్దేశించిన ప్రదేశాల్లోనే అమ్మకాలు జరపాలి



మలక్‌పేట ఫైర్ స్టేషన్ పరిధిలో సుమారు 100 దుకాణాలకు తాత్కాలిక అనుమతులు ఇచ్చాం. దుకాణాల్లో వంద కిలోల కంటే ఎక్కువ బాణాసంచా ఉంచొద్దు. టపాసుల విక్రయాలకు అనుమతులు తీసుకున్న వారు నిర్దేశించిన ప్రాంతాల్లోనే వాటిని అమ్మాలి. అక్కడ అన్ని జాగ్రత్తలు పాటిస్తూ విక్రయాలు జరపాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా ప్రమాదం జరిగితే సమాచారం వెంటనే ఇవ్వండి.

- సొరెడ్డి ఆంజిరెడ్డి, ఇన్‌చార్జి అధికారి, మలక్‌పేట ఫైర్‌స్టేషన్

ధరలు పెరిగాయి



గతేడాదితో పోలిస్తే హోల్‌సేల్ దుకాణాల్లోనే అన్ని ధరలు 15 నుంచి 20 శాతం వరకు పెరిగాయి. లేబర్, ట్రాన్స్‌పోర్ట్స్, పన్నులు, దుకాణ అద్దెలు, కెమికల్స్ ధరలు పెరగడంతో ఆ భారం టపాసుల ధరలపై పడింది. అందుకే ధరలు పెరిగాయి. విక్రయాలు పూర్తిగా వాతావరణం మీదే ఆధారపడి ఉంటాయి. అనుకూలంగా ఉంటే పూర్తిగా సేల్ అవుతాయి.

- పాదిల శ్రీధర్, వ్యాపారి

పాలకవర్గంపై అభివృద్ధి బాధ్యత పెరిగింది

- కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ జయశ్రీరాజు



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జయశ్రీరాజు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో మరో నాలుగు గ్రామాలు కలువడంతో పాలకవర్గంపై అభివృద్ధి బాధ్యత పెరిగిందని చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన లక్ష్మారెడ్డి పాలెంలోని ఎస్ఎన్ఆర్ కళాకన్వెన్షన్‌లో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 43 అంశాలపై చర్చ జరిగిన తర్వాత కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం జయశ్రీరాజు మాట్లాడుతూ మున్సిపాలిటీ విస్తీర్ణం పెరుగడంతో శానిటేషన్, విద్యుత్ సమస్యలపై ప్రత్యేక ఫోకస్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 24 వార్డులతోపాటు మరో నాలుగు గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. దశలవారీగా అన్ని వార్డుల్లో మౌలికవసతుల కల్పనకు పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ద్వారా ఎక్కువ నిధులు రాబట్టి పెద్దఅంబర్‌పేట్ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు చెప్పారు. పెద్దఅంబర్‌పేట్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే పాలకవర్గం లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్ రెడ్డి, మేనేజర్ కిరణ్‌కుమార్, డీఈఈ శివానందంతోపాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డబ్బులకు పోస్టింగ్‌లు ఇప్పించుడే ఆయన పని

- ప్రజాసమస్యలను పరిష్కరించ లేని మధుయాష్కీగౌడ్
- 118 జీఓ సమస్యను పరిష్కరించే వరకూ నిద్రపోను
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచారకమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ డబ్బులు తీసుకుని పోస్టింగ్‌లు ఇప్పించడమే తప్ప ప్రజాసమస్యలను పరిష్కరించలేని వ్యక్తి అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒళ్లు దగ్గరపెట్టుకుని తనపై మాట్లాడాలని లేకుంటే వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన జీఓ118కు సంబంధించిన వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధుల సమావేశానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఎల్బీనగర్ నియోజకవర్గానికి వర్తిస్తున్న 118 జీవో విషయంలో ఎవరు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, కన్వీనెన్స్ డీడ్ ఇచ్చేవరకూ 'మీతో కలిసి పోరాటం చేస్తా. ఎమ్మెల్యే పదవికి నా రాజీనామా లెటర్‌తోనే 118 జీవో త్వరితగతిన అమలులోకి వచ్చింది' అని అన్నారు. 118 జీవోతో 2,400 కన్వీనెన్స్ డీడ్‌లను అధికారులు రిలీజ్ చేశారని, దీంట్లో 940 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు పూర్తైనట్లు ఆయన తెలిపారు. మిగిలిన వారికి కూడా న్యాయం చేసే వరకు అండగా ఉంటానన్నారు. 118 జీవో తప్పులతడక అని, తాను ప్రజలను మోసం చేసినట్లు ఆరోపిస్తున్న మధుయాష్కీగౌడ్ 'ఉన్నది మీ కాంగ్రెస్ ప్రభుత్వం కదా. ఇట్టి సమస్యను ఇప్పటి వరకు ఎందుకు పరిష్కరించలేదు' అని ప్రశ్నించారు. నిజామాబాద్ ప్రజలు కాదంటేనే ఇక్కడికి వచ్చి రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. డబ్బులు వచ్చే పనులు చేస్తవు కానీ, ప్రజాసమస్యలను మాత్రం పరిష్కరించవా అని ఎద్దేవాచేశారు. డబ్బులు తీసుకుని పోస్టింగ్‌లు ఇప్పించడమే 'నీ పని' అని, త్వరలోనే ఆ వివరాలను తెలియజేస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మధుయాష్కీ కంటే తనకే ఎక్కువ సన్నిహితుడని అన్నారు. రాహుల్ గాంధీని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసే మధుయాష్కీగౌడ్ తనపై మాట్లాడేముందు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. 118 సమస్య పరిష్కారం కాకుంటే రాజీనామా చేయడానికి కూడా సిద్ధం అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు దండు పుల్లారెడ్డి, పోగుల రాంబాబు, పురుశోత్తంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ముత్యం రావు, రవీందర్‌రెడ్డి, పార్టీ నాయకులు సుమన్‌గౌడ్, సతీష్‌కుమార్ గౌడ్, గంగం శివశంకర్, మనోజ్ గౌరిశెట్టి, కాజ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూ సమస్యను పరిష్కరించాలి

తహసీల్దార్‌కు మజీద్‌పూర్ సీలింగ్ పట్టా రైతుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీలింగ్ పట్టా రైతులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ సర్వే నంబర్ 161, 162, 163లోని సీలింగ్ పట్టా రైతులు మంగళవారం తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డిని కలిశారు. సీలింగ్ భూసమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. 50 ఏళ్ల క్రితం గ్రామంలోని 143 కుటుంబాల రైతులకు 243 ఎకరాల సీలింగ్ భూమి సర్టిఫికెట్లను ప్రభుత్వం పంపిణీ చేసిందని తెలిపారు. అందులో 17 మంది రైతులకు చెందిన 18 ఎకరాల సీలింగ్ భూమిని రైతులకు తెలియకుండానే కొందరు భూ అక్రమార్కులు అధికారులతో కుమ్మక్కై సేల్‌డీడ్ చేయించుకున్నారని తహసీల్దార్‌కు విన్నవించారు. విషయం తెలిసిన రైతులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే అక్రమంగా చేసిన సేల్‌డీడ్‌లను రద్దుచేసి, రైతులకు న్యాయం చేయాలని కోరారు. అందులో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సీలింగ్ సర్టిఫికెట్‌లు ఉన్న రైతులకు పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, మేడిపల్లి నర్సింహగౌడ్, కాంట్రాక్టర్ రమేష్, కక్కెర్ల జంగయ్య యాదవ్, యాదయ్య, బాలయ్య, సాయికుమార్, వీరయ్య, దర్శన్, బాలశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ కమిషనర్‌గా జ్ఞానేశ్వర్



సరూర్‌నగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఆర్.జ్ఞానేశ్వర్‌ను నియమిస్తూ మునిసిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటిదాకా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన ఆయనను మీర్‌పేట్‌కు బదిలీ చేశారు. మీర్‌పేట్ కమిషనర్‌గా పనిచేసిన చంద్రశేఖర్‌ను ఘట్‌కేసర్ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. గతంలో కొన్నాళ్ల పాటు జ్ఞానేశ్వర్ మీర్‌పేట్ ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నవంబరులో కార్తీక పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్టీసీ హైదరాబాద్-2 డిపో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. నవంబరు 13వ తేదీన రాత్రి 7.15గంటకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి ప్రత్యేక బస్సులు బయల్దేరి, ముందుగా కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందని ఆయన వివరించారు. గిరిప్రదక్షిణ అనంతరం తిరిగి నవంబరు 16వ తేదీన మధ్యాహ్నం హైదరాబాద్‌కు బయల్దేరుతుందన్నారు. ఒకరికి టికెట్ చార్జీ రూ.3,900 వసూలు చేయనున్నారు. ముందుగా ప్రయాణికులు టికెట్లను రిజర్వు చేసుకోవాలన్నారు. ఇందుకు టీజీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్ ద్వారా గానీ, ఏటీబీ ఏజెంట్ల ద్వారా గానీ టికెట్లను రిజర్వు చేసుకోవచ్చని డిపో మేనేజర్ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష

చాదర్‌ఘాట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించినందుకు నమోదైన పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ స్పెషల్ సెషన్స్ కోర్టు జడ్జి బి.పుష్పలత మంగళవారం తీర్పునిచ్చారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019 సెప్టెంబరు 13వ తేదీన మలక్‌పేట తీగలగూడలోని రాములు హట్స్‌లో నివాసముంటున్న పోలేపంగు మామి కుమార్ అలియాస్ మణి (23) ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టుచేసి నాంపల్లిలోని స్పెషల్ సెషన్స్ కోర్టులో హాజరుపరచారు. వాదనలను పరిశీలించిన కోర్టు నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

చేనేతలకు త్రిఫ్ట్, నూలు సబ్సిడీలను పునరుద్ధరించండి

మన్సూరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు త్రిఫ్ట్, నూలు సబ్సిడీ పథకాలను పునరుద్ధరించేలా ప్రభుత్వం చొరవ చూపాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ డివిజన్ సహారా ఎస్టేట్స్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్ అధ్యక్షతన మంగళవారం చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ వాయిదా వేస్తూ వస్తున్న చేనేత సహకార సంఘం ఎన్నికలను తక్షణమే చేపట్టాలన్నారు. చేనేత కార్మికుల ఉపాధి, సంక్షేమ అభివృద్ధి బోర్డును ఏర్పాటుచేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించి ప్రతి చేనేత కార్మికుడికి పెట్టుబడి సాయం కింద రూ.5లక్షలు అందించాలని కోరారు. చేనేత కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు బీమా పథకం అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, సహాయకార్యదర్శి ముసం నరహరి, సలహాదారు బడుగు శంకరయ్య, ఉపాధ్యక్షుడు వనంఉపేందర్, కర్నాటి వెంకటేశం, ఇ.పెంటయ్య, జి.శేఖర్, వెంకటేశ్వర్లు, జి.శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా మన్సూరాబాద్ అభివృద్ధి

జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా స్పష్టమైన అవగాహనతో ఎక్కడా రాజీలేకుండా మన్సూరాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఆగమయ్యనగర్ కాలనీలో రూ.19లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డబ్ల్యూఐ సీతారాం, కాలనీవాసులు జనార్దన్ రెడ్డి, కుదిరం బోస్, ఆంజనేయులు, ముత్యం, శ్రీరాములు, బాలరాజు, వెంకటాచారి, కృష్ణారెడ్డి, భాస్కర్ రావు తదితరులు ఉన్నారు.

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధికి సహకరించండి

వనస్థలిపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్‌రెడ్డికి శివారు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బృందావన్ కాలనీ అధ్యక్షుడు శశికాంత్, శ్రీనివాస కాలనీ అధ్యక్షుడు చిత్తరంజన్, విద్యారెడ్డి, జగన్ మోహన్ చారీ, వేణు, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుడా కాలనీ బస్తీ కమిటీ కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ లెనిన్‌నగర్‌లోని హుడా కాలనీ బస్తీ కమిటీకి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జి.కృష్ణ, సీహెచ్.పుల్లయ్య, ఎం.రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.నర్సింగ్‌రావు, అధ్యక్షుడిగా జి.మహేశ్, ఉపాధ్యక్షుడిగా వి.నాగరాజు, ప్రధానకార్యదర్శిగా ఎ.ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా కె.శంకర్, కోశాధికారిగా జి.దశరథ్, సహాయ కోశాధికారిగా కె.రాకేశ్ తదితరులను ఎన్నుకున్నారు.

నాదర్‌గుల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

సరూర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నాదర్‌గుల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో 1997-98వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు తొలిసారిగా మంగళవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు గత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నరసింహచారి, బల్వంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అరుణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన స్థలంలో పాఠశాల భవనం నిర్మించండి



ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

మన్సూరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పాఠశాలకే చెందేలా కృషి చేసి, భవనం నిర్మించాలని బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి మంగళవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల పాఠశాలకు కేటాయించిన స్థలం తమదేనంటూ కొందరు కబ్జాదారులు వచ్చి కూల్చివేశారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యపై పూర్తివిచారణ చేపట్టి పాఠశాలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చెరుకు ప్రశాంత్‌గౌడ్, బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకులు అనంతుల రాజారెడ్డి, పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి : మేయర్

సరూర్‌నగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్‌లోని ఉద్యోగ్‌నగర్ కాలనీలో జరుగుతున్న కమ్యూనిటీహాల్ నిర్మాణం పనులను మంగళవారం కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాల్ నిర్మాణంలో నాణ్యతను కచ్చితంగా పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కాలనీ అవసరాల నిమిత్తం ఈ హాల్ నిర్మాణం చేపడుతున్నామని ఆమె పేర్కొన్నారు.

సదర్ వేడుకలకు ఎంపీ ఈటలకు ఆహ్వానం

సైదాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి మరుసటి రోజు (శుక్రవారం) ఉప్పరిగూడ యాదవసంఘం ఆధ్వర్యంలో చంచల్‌గూడచౌరస్తాలో నిర్వహించే సదర్‌మేళాకు హాజరు కావాలని మంగళవారం ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సంపత్‌యాదవ్, నిరంజన్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ



పార్టీ సభ్యత్వం అందజేస్తున్న అశోక్‌గౌడ్ తదితరులు

మన్సూరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కులం, మతం, ప్రాంత భేదంలేకుండా యావత్ దేశప్రజల నుంచి ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్‌కు విశేష ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇన్‌చార్జి గంగారెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఎల్బీనగర్ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లతో బీజేపీ క్రియాశీల సభ్యత్వ నమోదుపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ డివిజన్లవారీగా ప్రతి పోలింగ్ బూత్‌కు వంద మందికి పైగా సభ్యత్వం నమోదు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, రంగ నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కళ్లెం జీవన్‌రెడ్డి, లచ్చిరెడ్డి, పవన్‌కుమార్, నాంపల్లి రామేశ్వర్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, బండారి భాస్కర్, గీతారెడ్డి పాల్గొన్నారు.

తారామతిపేటలో..

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తారామతిపేటలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్త అశోక్‌గౌడ్ హాజరై సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి పాపయ్యగౌడ్, శ్రీనివాస్‌యాదవ్ పిల్లి, మధు, సత్యనారాయణగౌడ్, శ్రావణ్‌చారి, నాగరాజు, జంగయ్య, అంజయ్య, శివగౌడ్, వినోద్, మల్లేష్, నరేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

ఓల్డ్‌మలక్‌పేట, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా రెండు రోజులు సెలవులు వచ్చాయి. గురువారం దీపావళి పండుగ సందర్భంగా సెలవు అని, శుక్రవారం అమావాస్య కావడంతో మార్కెట్ బంద్ ఉంటుందని, మార్కెట్‌కు పంట తెచ్చే రైతులు విషయాన్ని గమనించాలని మార్కెట్ నిర్వాహకులు కోరారు. మార్కెట్‌లో ప్రస్తుతం ఉల్లిగడ్డ సీజన్ నడుస్తోందని, పెద్దఎత్తున రైతులు ఉల్లి పంట తీసుకువస్తున్నారని చెప్పారు. మంగళవారం రోజు 12వేల క్వింటాల ఉల్లిగడ్డ మార్కెట్‌కు వచ్చిందన్నారు. మొదటిరకం ఉల్లిగడ్డ క్వింటా రూ.4,600 ధర పలుకగా రెండోరకం రూ.4,200, మూడోరకం రూ.4,100 ధర పలికిందని తెలిపారు.

మహిళా ఉద్యోగులకు న్యూడ్ వీడియోలు

- యువకుడిని చితకబాదిన కంపెనీ ఉద్యోగులు
- కనిపించడం లేదని పోలీసులకు తండ్రి ఫిర్యాదు

సరూర్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గతంలో తాను పనిచేసిన ఓ కంపెనీకి చెందిన మహిళా ఉద్యోగులకు(అమ్మాయిలకు) న్యూడ్‌వీడియోలు పంపి వేధింపులకు గురిచేస్తున్న యువకుడిని సదరు కంపెనీ ఉద్యోగులు చితకబాదారు. దాంతో మనస్థాపానికి గురైన అతడు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. యువకుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన మీర్‌పేట్ పోలీసులు.. ఎట్టకేలకు ఆ యువకుడు వైజాగ్‌లో ఉన్నట్టు గుర్తించారు. నగరంలోని ఖైరతాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ కమలానగర్‌కు చెందిన కుంచెల నాగరాజు(20) పనిచేసేవాడు. రెండు నెలల క్రితం అతడు పనిమానేసి వేరే వ్యాపకాలు చేసుకుంటున్నాడు. గతంలో పరిచయం ఉన్న సదరు కంపెనీలోని పలువురు మహిళా ఉద్యోగులకు ఇటీవల అతడు వాట్సాప్‌లో న్యూడ్‌వీడియోలు పంపించాడు. కంపెనీకి చెందిన ఇతర ఉద్యోగులు సోమవారం ఉదయం నాగరాజు ఇంటికి వచ్చి కొట్టుకుంటూ బయటకు తీసుకెళ్లి ఓచోట వదిలేసి వెళ్లారు. మనస్థాపానికి గురైన నాగరాజు అదృశ్యమయ్యాడు. దీంతో అతడి తండ్రి సోమవారం రాత్రి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాగరాజు వైజాగ్‌లో ఉన్నట్టు గుర్తించారు. అనంతరం అతడిపై దాడి చేసినట్టుగా భావిస్తున్న వ్యక్తులను సైతం అదుపులోకి తీసుకున్నారు. నాగరాజును వైజాగ్ నుంచి మీర్‌పేట్‌కు రప్పిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ కీసరి నాగరాజు తెలిపారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786